గల్లా పట్టి అడుగు.. ఈ సిగ్గులేని సర్కారును!

మొదటిపేజీ తరువాయి...

అయితయని తొలుత చెప్పి, చివరికి రూ.7,500 కోట్లు రైతుల ఖాతాల్లో వేశారని, ఎక్కడి రూ. 49 వేల కోట్లు, ఎక్కడి రూ.7,500 కోట్లు అని ఎద్దేవా చేశారు. అబద్ధాలతో అధికారంలోకి వచ్చి మోసగించిన కాంగ్రెస్ నేతలను ప్రజలు ఎక్కడికక్కడ గల్లా పట్టి నిలదీయాలని పిలుపునిచ్చారు. రైతులందరికీ పూర్తిగా రుణమాఫీ అయ్యే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆగదని స్పష్టంచేశారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలతోపాటు డిక్లరేషన్లపైనా వెంటపడుతూనే ఉంటామని హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గ కేంద్రంలో గురువారం నిర్వహించిన రైతు నిరసన దీక్షలో కేటీఆర్ స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, మహమూద్ అలీ, మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో కలిసి పాల్గొని ప్రసగించారు.

'చేవెళ్ల చెల్లెమ్మగా పిలుచుకొనే వ్యక్తి సబితా ఇంద్రారెడ్డి నియోజకవర్గంలోని నర్కోడా గ్రామానికి మూడు రోజుల కిందట పెండ్లికి వెళ్లిన. అక్కడ గ్రామంలో కళ తప్పిందని ప్రజలు చెప్తున్నారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత మా బతులుకు ఆగమైనయ్ అని అంటున్నరు. అన్న వస్త్రం కోసం పోతే ఉన్న వస్త్రం పోయింది. రేవంత్ రెడ్డి చెప్పుడు మాటలు విని ఆగమైపోయినం అని అంటున్నరు' అని కేటీఆర్ పేర్కొన్నారు. 'డిసెంబర్ తొమ్మిదినాడే తొలి సంతకం రూ. 2 లక్షల రుణమాఫీపై పెడతానని సోనియాగాంధీ మీద ఒట్టేసి రేవంత్‌రెడ్డి చెప్పారు. సచివాలయంలో లంకె బిందెలు ఉంటాయనుకున్నా కానీ అవి లేనే లేవు. ఎట్ల రుణమాఫీ చేయాలే అన్నట్టుగా మాట మార్చారు. కొత్తగా వచ్చాడు కదా ఆయనకు కొంత టైమ్ ఇద్దామని మేము కూడా ఎదురుచూశాం. ఇదే రేవంత్ రెడ్డి బ్యాంకర్లతో సమావేశం పెట్టారు. 2 లక్షల రుణమాఫీ కోసం రూ.49 వేల కోట్లు కావాలని బ్యాంకర్లు చెప్పారు. దాంతో తప్పించుకొనేందుకు నాటినుంచి చావు తెలివితేటలు స్టార్ట్ చేయడం మొదలు పెట్టారు. ఒక్క ఏడాది కడుపు కట్టుకుంటే రూ.40 వేల కోట్లు కట్టేస్తా.. అని 9 వేల కోట్లు కట్ చేసి మీడియా ముందు మాట్లాడారు. ఆ తర్వాత జూలైలో మంత్రివర్గంలో చర్చించి ఏదోవిధంగా కటింగ్ పెట్టాలని సీఎంకు మంత్రులు సలహా ఇచ్చారు. దాంతో రైతుల రుణమాఫీపై ఆంక్షలు మొదలుపెట్టారు. అందుకే క్యాబినెట్‌లో మీటింగ్‌నాటికి దాన్ని రూ.31 వేల కోట్లకు తగ్గించారు. ఇక బడ్జెట్‌లో రుణమాఫీకి రూ.26 వేల కోట్లు మాత్రమే కేటాయించారు. దీని మీద గట్టిగా అడిగితే రేవంత్‌కు చెప్ప చేతకాలేదు' అని కేటీఆర్ మండిపడ్డారు.

చేవెళ్ల ధర్నాలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బీఆర్ఎస్ నాయకుడు కార్తీక్‌రెడ్డి, ధర్నాకు హాజరైన రైతులు, ప్రజలు

> ప్రభుత్వాన్ని నడపడం అంటే మాటలు చెప్పినంత ఈజీ కాదు. చెట్టుకు కట్టేసి కొడతా, తొండలు జొర్రకొడతా అని గతంలో రేవంత్ అన్నారు. ఇప్పుడు హామీలు నెరవేర్చకుంటే ప్రజలే ఆయనకు ఆ పనిచేస్తారు. కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఎలా ఉండేదో, ఇప్పుడు ఎలా ఉందో మీరే ఆలోచించాలి. అన్ని ప్రాజెక్టులను రద్దు చేసి ప్రజలను ఆగం చేస్తుండు. బీఆర్ఎస్ అంటే భారత రాష్ట్ర సమితి మాత్రమే కాదు.. భారత రైతు సమితి కూడా. మొత్తం రైతులందరికీ రుణమాఫీ అయ్యే వరకు పోరాటం ఆపేది లేదు. రుణమాఫీ మాత్రమే కాదు, కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు, డిక్లరేషన్లపైనా వెంటపడతాం. -కేటీఆర్

రుణమాఫీలో కటింగ్ పెడితే.. రైతు భరోసాలోనూ కటింగ్‌లే

ఇప్పుడు రుణమాఫీలో కటింగ్ పెడితే వచ్చే రైతు భరోసాలో కూడా రేవంత్‌రెడ్డి కటింగ్‌లు పెడతారని కేటీఆర్ హెచ్చరించారు. ప్రజలు, రైతులు ఇప్పుడు వదిలిస్తే తర్వాత కూడా ఇదే విధంగా కోతలు పెట్టుకుంటుపోతారని తెలిపారు. 'మేం అధికారంలోకి రాగానే డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తాం. రుణం తీసుకోని రైతులు ఎవరైనా ఉంటే ఉరికిపోయి తెచ్చుకోండి' అని రేవంత్‌రెడ్డి ఎన్నికల సభలో చెప్పారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే మొత్తం రుణంమాఫీ అయితదని అనుకున్న అని నర్సాపూర్‌లో ఒక రైతు చెప్పాడు. 9 నెలల లేటుకుగాను వడ్డీ అడుగుతున్నారంట. రైతుల మిత్తితోసహా ఎలాంటి కొర్రీలు, ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలన్నదే మన డిమాండ్. కేసీఆర్ ఉన్నప్పుడు 72 లక్షల మంది రైతులకు రైతుబంధు వేశాం. అప్పుడు లేని సమస్యలు ఇప్పుడు ఎందుకు వస్తున్నయ్. రుణమాఫీ జరుగుతుందని అధికారులు చెప్తున్నారు. మనం అడగాల్సింది అధికారులను కాదు. కాంగ్రెస్ నాయకులను అడగాలె. ఇవ్వాళ ఇద్దరు మహిళా జర్నలిస్టులు ఏం పాపం చేశారు. నిజంగా రుణమాఫీ వంద శాతం అయితే మహిళా జర్నిస్టులపై దాడులు చేయించావ్. ముఖ్యమంత్రి పుట్టిన ఊరు కొండారెడ్డిపల్లిలో మహిళా జర్నలిస్టులను కొట్టి వారితో అసభ్యంగా ప్రవర్తిస్తారా?' అని కేటీఆర్ నిలదీశారు.

> కేసీఆర్ ఉన్నప్పుడు 72 లక్షల మంది రైతులకు రైతుబంధు వేశాం. అప్పుడు లేని ఆధార్ సమస్యలు, సాంకేతిక సమస్యలు, రేషన్‌కార్డు సమస్యలు, బ్యాంకు సమస్యలు ఇప్పుడు ఎందుకు వస్తున్నయ్. రుణమాఫీ జరుగుతుందని అధికారులు చెప్తున్నరు. మనం అడగాల్సింది అధికారులను కాదు.. కాంగ్రెస్ నాయకులను. -కేటీఆర్

కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గల్లా పట్టి నిలదీయాలి

రుణమాఫీపై ప్రజలు తాము ఓట్లు వేసిన కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యేలను గల్లా పట్టి నిలదీయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. అధికారులు చుట్టూ తిరగాల్సిన గర్జు మనకెందుకు? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఉంటే తమ తరఫున పోరాటం చేయాలని రైతులు అడగాలని సూచించారు. ఇవ్వాళ్టి పోరాటం మొదటి అడుగు మాత్రమేనని, రైతులందరికీ మొత్తం రూ. 2 లక్షలు రుణంమాఫీ చేసే వరకు వదిలిపెట్టబోమని హెచ్చరించారు. 'మాటలు చెప్పినంత ఈజీ కాదు ప్రభుత్వాన్ని నడపటం. చెట్టుకు కట్టేసి కొడుతా, తొండలు జొర్రకొడుతా అని గతంలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. ఇప్పుడు ఆయన చెప్పిన హామీలు నెరవేర్చకుంటే అదే పని ఆయనకు ప్రజలు చేస్తారు. ఏ ఊరిలోకి అయిన సరే వెళ్లి అడుగుదాం ఒక్కరైనా నీ పాలనను మెచ్చుకుంటున్నారా? కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఎలా ఉండేదో ఇప్పుడు ఎలా ఉందో మీరే ఆలోచించాలి. అన్ని ప్రాజెక్టులు రద్దు చేసి ప్రజలను ఆగం చేస్తుండు. బీఆర్ఎస్ అంటే భారత రాష్ట్ర సమితి మాత్రమే కాదు. భారత రైతు సమితి కూడా. మొత్తం రైతులందరికీ రుణమాఫీ అయ్యే వరకు పోరాటం ఆపేది లేదు. ఒక్క రుణమాఫీ మాత్రమే కాదు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, డిక్లరేషన్లు మీద కూడా వెంటపడుతాం. కాంగ్రెస్ ఇచ్చిన ఏ హామీకి సంబంధించి అయిన వెంటాడటమే. ప్రజాస్వామ్యబద్ధంగా ఒక్కటైట్టి కాంగ్రెస్ 420 హామీలను ప్రజల ముందుపెడదాం. రేవంత్‌రెడ్డి లాగా మనం బజారు భాష మాట్లాడాల్సిన అవసరం లేనే లేదు. రాష్ట్రంలో ఉన్న 70 లక్షల మంది రైతులకు రుణమాఫీ జరిగే వరకు ప్రభుత్వాన్ని వెంటాడుతూనే ఉంటాం. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ ప్రకారం 2 లక్షల రుణమాఫీ చేయాల్సిందే' అని హెచ్చరించారు.

> రుణమాఫీపై ప్రజలు తాము ఓట్లు వేసిన కాంగ్రెస్ నాయకులు, ఎమ్మెల్యేలను గల్లా పట్టి నిలదీయాలి. అధికారుల చుట్టూ తిరగాల్సిన గర్జు మనకెందుకు? -కేటీఆర్

సూర్యచంద్రులు ఉన్నంత వరకు కేసీఆర్ ఉంటరు: సబితా ఇంద్రారెడ్డి

తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు అంశంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను నోటికొచ్చినట్టు రేవంత్‌రెడ్డి మాట్లాడటం నీచశైలికి నిదర్శమని మాజీ మంత్రి, చేవెళ్ల ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మండిపడ్డారు. తెలంగాణలో కేసీఆర్ ఆనవాళ్లు చెరిపివేయాలనుకోవడం మూర్ఖత్వమని విమర్శించారు. సూర్య చంద్రులు ఉన్నంత వరకు కేసీఆర్ పేరు ఉంటదని చెప్పారు. మనం తాగే భగీరథ నీళ్లలో, మన ఊళ్లో ఏపుగా పెరిగిన చెట్ల నీడల్లో కేసీఆర్ కనిపిస్తున్నారని తెలిపారు. కేసీఆర్ పాలనలో ఇలా ఎప్పుడైనా రుణమాఫీపై దరఖాస్తులు ఇచ్చామా? అని ప్రశ్నించారు. గ్రామాల్లో రుణమాఫీ కాని రైతుల జాబితాను సిద్ధం చేద్దామని, వారం, పది రోజుల్లో నియోజకవర్గంలో రుణమాఫీ కాని రైతుల జాబితాను ఈ రోడ్డు మీదుగా వెళ్లే రేవంత్‌రెడ్డి ముఖాన కొడదామని పేర్కొన్నారు. ఇవ్వాళ మహిళా జర్నలిస్టులను కొట్టిపించిన వ్యక్తి రేవంత్‌రెడ్డి అని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చే వరకు ప్రజల పక్షాల బీఆర్ఎస్ వెంటాడుతూనే ఉంటుందని చెప్పారు.

కాంగ్రెస్ దొంగ పార్టీ: మహమూద్ అలీ

అబద్ధాల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. కాంగ్రెస్ దొంగ పార్టీ అని మాజీ మంత్రి మహమూద్ అలీ పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతల అబద్ధాలు నమ్మి మోసపోయామని రైతులు బాధపడుతున్నారని చెప్పారు. 14 ఏండ్లు పోరాడి తెలంగాణ సాధించిన కేసీఆర్.. పదేండ్లు కష్టపడి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తే 8 నెలల్లోనే రేవంత్‌రెడ్డి భ్రష్టు పట్టించారని మండిపడ్డారు. కేసీఆర్, కేటీఆర్ నాడు పరిశ్రమలు రాష్ట్రానికి తీసుకొస్తే నేడు ఆ పరిశ్రమలు బయటకు వెళ్లిపోతున్నాయని విమర్శించారు. బీఆర్ఎస్ రైతు సంక్షేమ పార్టీ అని చెప్పారు. కేసీఆర్ హయాంలో రైతుల ఆత్మహత్యలు జరుగలేవని, ఇప్పుడు రైతుల ఆత్మహత్యలు నిత్య కృత్యం అయ్యాయని చెప్పారు.

పైవేటు హౌస్ వెనుక డోర్ నుంచి ఎవరొస్తున్నారు: స్వామిగౌడ్

ముఖ్యమంత్రి హోదాలో ఎవరైనా అధికారిక నివాసాన్ని వాడుకుంటారని, పైవేటు హౌస్ వెనుకడోరు నుంచి ఎవరొస్తున్నారని శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ రేవంత్‌రెడ్డిని నిలదీశారు. వెనుకడోరు నుంచి వచ్చి ఎవరెవరు ముఖ్యమంత్రిని కలుస్తున్నారని ప్రశ్నించారు. అదానీలు, అంబానీలకు వెనుకడోరు తీస్తున్నారా? అని అనుమానం వ్యక్తం చేశారు. తెలంగాణలో మాయమైనపోయిన పచ్చజెండాలు ఇటీవల హైదరాబాద్ నగరంలో ఎలా రెపరెపలాడాయని ప్రశ్నించారు. నిరుద్యోగులకు, ఉద్యోగులకు, మహిళలకు, రైతులకు కుచ్చుటోపీ పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వంపై మరో ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కార్తీక్‌రెడ్డి, పట్నం అవినాశ్‌రెడ్డి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

లోకం పోకడ

పొద్దున బ్యాంకుకు, మధ్యాహ్నం కలెక్టరాఫీసుకు, సాయంత్రం వ్యవసాయ కార్యాలయానికి తిరిగినా రుణమాఫీ కాలేదు గానీ, వ్యవసాయం మాత్రం మాఫీ అయింది!

రుణమాఫీ బూటకం: సత్యవతిరాథోడ్

మహబూబాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నాటకం ఆడుతుందని.. రైతులకు రుణమాఫీ చేశామని అబద్ధపు మాటలు చెబుతున్నదని మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ మండిపడ్డారు. గురువారం మానుకోట జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ రైతులందరికి ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం రైతులకు తీరని ద్రోహం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభుత్వంపై పోరాటం ఆగదు: జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట అర్బన్, ఆగస్టు 22 : తెలంగాణ రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లిస్తామన్న 49 వేల కోట్ల రుణమాఫీని వెంటనే చేయాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీని గుర్తుచేసేందుకే రైతుల పక్షాన బీఆర్ఎస్ ధర్నాకు దిగిందని తెలిపారు. సూర్యాపేట జిల్లా కేంద్రలోని వాణిజ్య భవన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన రైతు ధర్నాలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేయలేకనే బీఆర్ఎస్ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నదని మండిపడ్డారు. రేవంత్ సర్కార్ ప్రజలను బహిరంగంగానే మోసం చేసిందని విమర్శించారు. రుణమాఫీ ఎంత చేశారో చెప్పడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ చేసే వరకు రైతుల పక్షాన బీఆర్ఎస్ పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మాఫీకి కొర్రీలెందుకు?: శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ , ఆగస్టు 22 : రూ.2 లక్షలు మాఫీ చేస్తామని ఇప్పుడు కొర్రీలు ఎందుకు పెడుతున్నారని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పాలమూరులో నిర్వహించిన ధర్నానుద్దేశించి ఆయన మాట్లాడారు. రేవంత్ సర్కార్ బుర్ర కథలు చెప్పి.. రైతుల చెవుల్లో కాంగ్రెస్ నేతలు పూలు పెట్టారని ధ్వజమెత్తారు. 25 శాతం మందికి కూడా రుణమాఫీ కాలేదని, 75 శాతం మందికి ఎగ్గొడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ మోసపూరిత మాటలు నమ్మి రైతులు 'పాలిచ్చే బర్రెను విడిచిపెట్టి.. దున్నపోతులాంటి ప్రభుత్వాన్ని కొట్టంలో కట్టేసుకున్నారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలకతీతంగా కదంతొక్కి ప్రభుత్వం మెడలువంచి ఇచ్చిన హామీలు నెరవేర్చేలా పోరాడుతామని స్పష్టం చేశారు.

రైతులను దగా చేసిన రేవంత్: కొప్పుల

కరీంనగర్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): ఆగస్టు 15 లోగా 2లక్షల రుణమాఫీ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్టేసి రైతులను దగా చేశాడని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ.. అనేక కొర్రీలు పెట్టి వేలాది మందికి ఎగనామం పెట్టారని ఆరోపించారు. వెంటనే షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల నేతృత్వంలో రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు భారీ ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాల కోరు అని, మోసపూరిత మాటల్లో ఆరితేరిండని మండిపడ్డారు.

ప్రతి రైతుకూ మాఫీ చేయాల్సిందే: పువ్వాడ

ఖమ్మం, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): చివరి రైతు వరకూ రుణం మాఫీ జరిగే వరకు బీఆర్ఎస్ పోరాడుతుందని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ హెచ్చరించారు. ఖమ్మంలో జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ.. రుణమాఫీపై అనేక ఆంక్షలు పెట్టి రైతులను మోసగించిన రాష్ట్ర ప్రభుత్వం వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేసేయాలన్నారు.

రైతును మోసగించిన రేవంత్: జోగు

ఆదిలాబాద్, ఆగస్టు 22: రెండు లక్షల రుణాన్ని మాఫీ చేస్తామని చెప్పి రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేశాడని మాజీ మంత్రి జోగు రామన్న విమర్శించారు. ఆదిలాబాద్‌లో జరిగిన రైతు ధర్నాలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో రైతులపై ప్రేమ కనపరిచి అధికారంలోకి తర్వాత గాలికి వదిలేసిందని ఆరోపించారు. రుణమాఫీ విషయంలో రైతుల ఆందోళనకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. రైతులందరికీ బ్యాంక్‌లోన్ రద్దు అయ్యేంత వరకు పోరాడుతామని స్పష్టం చేశారు.

తెలంగాణతల్లి విగ్రహాన్ని రేవంత్ పెట్టడమంటే

గాంధీ విగ్రహాన్ని గాడ్సే పెట్టినట్టే!

తెలంగాణ ద్రోహి పెడితే అంతే దారుణం • రుణమాఫీపై గ్రామగ్రామాన ఉద్యమాలు: కేటీఆర్

- ప్రతి గ్రామం వెళ్తాం.. రిలే దీక్షలు చేస్తాం
- ఉద్యమకాలంనాటి నిరసనలు మళ్లీ చేస్తాం
- రైతు రుణమాఫీపై అబద్ధాలు చెప్పినందుకు ముఖ్యమంత్రి ప్రజలకు క్షమాపణ చెప్పాలి
- రాహుల్‌గాంధీకి రేవంత్‌రెడ్డికి అదానీతో పాటు అనేక అంశాలపై భిన్నాభిప్రాయాలు
- కాంగ్రెస్ పార్టీ నాయకులు ఢిల్లీకి బానిసలు
- 9 నెలల్లో రేవంత్ సాధించిన విజయం ఏంటంటే ఢిల్లీకి 20 సార్లు పోయిరావటమే
- రాజ్యసభకు తెలంగాణ నుంచి అర్హులే లేరా?
- కేసీఆర్ గుర్తులు చెరిపేయాలంటే తెలంగాణ ఉండదు
- మీడియా చిట్‌చాట్‌లో కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): మహాత్మాగాంధీ విగ్రహాన్ని గాడ్సే పెడితే ఎంత దరిద్రంగా ఉంటదో తెలంగాణ తల్లి విగ్రహాన్ని రేవంత్‌రెడ్డి లాంటి తెలంగాణ ద్రోహి పెడితే అంతే దారుణంగా ఉంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ తల్లి అంటే తెలంగాణ జాతి అస్థిత్వానికి ప్రతీక, తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని వ్యక్తి ఎలా ఆ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠారని ప్రశ్నించారు. రుణమాఫీ విషయంలో గురువారం నాటి ధర్నాలు మొదటి స్టెప్ మాత్రమేనని, రెండోస్టెప్‌లో ప్రతి గ్రామం వెళ్తామని, రిలే దీక్షలు చేస్తామని, రుణమాఫీ అయ్యేవరకు వదిలిపెట్టబోమని హెచ్చరించారు. ఉద్యమకాలంనాటి నిరసనలు మళ్లీ చేస్తామని స్పష్టంచేశారు. గురువారం చేవెళ్లలో కేటీఆర్ మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రుణమాఫీపై తదుపరి కార్యాచరణను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. డిక్లరేషన్ల పేరుతో కాంగ్రెస్ ఏయే ప్రాంతాల్లో సమావేశాలు పెట్టిందో వాటిని అమలు చేయాలంటూ ఆ ప్రాంతాల్లోనే సెప్టెంబర్‌లో బీఆర్ఎస్ కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. ఆరు గ్యారెంటీల అమలుపై కూడా బీఆర్ఎస్ పోరాటాన్ని కొనసాగిస్తుందని చెప్పారు. రుణమాఫీ పేరుతో ఎన్నో మీటింగ్‌లు పెట్టి ఇన్ని నెలల తమాషా తర్వాత రైతు బంధు మూడు విడతల్లో రూ.7,500 కోట్లు మాత్రమే ఇచ్చారని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి అడ్డగోలుగా మాట్లాడుతుంటే మంత్రులు ఇరుక్కుపోతున్నారని పేర్కొన్నారు.

అప్పులపైనా సర్కార్ అసత్యాలు

రాష్ట్రం అప్పులపైనా రేవంత్‌రెడ్డి సర్కార్ అసత్యాలు, దుష్ప్రచారాలు చేస్తున్నదని కేటీఆర్ విమర్శించారు. జీతభత్యాలు, పెన్షన్లు, అప్పులకు మిత్తీలు లాంటి కచ్చితమైన ఖర్చులుపోనూ రాష్ట్ర రెవెన్యూ మిగులు బడ్జెట్‌లోనే ఉన్నదని తెలిపారు. 2014లో రూ.370 కోట్ల రెవెన్యూ మిగులు ఉంటే, 2023లో రూ.5,900 కోట్లు సర్‌ప్లస్‌గా వారికి ఇచ్చామని వెల్లడించారు. చేతగానితనాన్ని కప్పిపుచ్చుకోవటం కోసం సీఎం, మంత్రులు అప్పులపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. కేవలం ప్రజాఅంశాల నుంచి దృష్టి మరల్చేందుకే రేవంత్‌రెడ్డి బజారు భాష మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. 'రైతు రుణమాఫీపై అబద్ధాలు చెప్పినందుకు ప్రజలకు సీఎం క్షమాపణ చెప్పాలి. ఆగస్టు15లోగా ఎలాగూ రుణమాఫీ చేయలేదు. కనీసం ఎప్పటిలోగా చేస్తారో అదైనా చెప్పాలి. రైతు భరోసాను ఎప్పటిలోగా రైతుల ఖాతాలో వేస్తారో కూడా చెప్పాలి' అని డిమాండ్ చేశారు. విత్తనాల నుంచి మొదలుకొని యూరియా, ఎరువులు, విద్యుత్తు వరకు అన్నింటా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

రాహుల్, రేవంత్ మధ్య భిన్నాభిప్రాయాలు

రాహుల్‌గాంధీకి, రేవంత్‌రెడ్డికి మధ్య అదానీతో పాటు అనేక అంశాలపై విభిన్న అభిప్రాయాలు ఉన్నాయని కేటీఆర్ చెప్పారు. అదానీ అక్రమాలపై రాహుల్ మాట్లాడితే, రేవంత్‌రెడ్డి అదానీతో ఒప్పందాలు చేసుకొంటున్నారని తెలిపారు. అదానీ సంస్థల అక్రమాలపై హిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదికపై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ చేయించాలని తాము ముందు నుంచీ డిమాండ్ చేస్తున్నామని గుర్తుచేశారు. పదేండ్లపాటు తమ మెడమీద కత్తిపెట్టినా అదానీ కంపెనీని రాష్ట్రంలోకి రానివ్వలేదని చెప్పారు. అదానీ విద్యుత్తు మీటర్లను, అదానీ బొగ్గును తెలంగాణలోకి రానియ్యలేదని, కానీ, కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాజస్థాన్, తెలంగాణలో అదానీ వ్యాపారాలు చేస్తున్నారని వివరించారు. రూ.12,400 కోట్ల మేరకు అదానీతో పెట్టుబడులకు సంబంధించి రేవంత్‌రెడ్డి ఎంవోయూ కుదుర్చుకున్నారని పేర్కొన్నారు. అసలు అదానీ మంచివాడా? చెడ్డవాడా? అనే విషయాన్ని రాహుల్, రేవంత్‌రెడ్డి కూర్చొని తేల్చుకొని అభిప్రాయం చెప్పాలని చురక అంటించారు.

రాహుల్ వద్ద మార్కుల కోసమే రాజీవ్ విగ్రహం

అద్భుతంగా కట్టుకున్న సచివాలయం ముందు తెలంగాణ తల్లి విగ్రహం ఉండాలన్నదని తెలంగాణ ప్రజల ఆకాంక్ష అని కేటీఆర్ చెప్పారు. ఈ సందర్భంగా రేవంత్ వ్యాఖ్యలను మీడియా ప్రస్తావించగా, 'రాహుల్‌గాంధీ అయ్య విగ్రహం పెట్టి రాహుల్‌గాంధీ దగ్గర మార్కులు కొట్టేయాలని రేవంత్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నాడని నేను కూడా అనవచ్చు. రేవంత్ తన పార్టీ నాయకుల దగ్గర మార్కులు వేయించుకోవడానికి తెలంగాణ జాతి మొత్తాన్ని అవమానిస్తున్నారు. తెలంగాణ తల్లి విగ్రహం పెట్టడానికి రేవంత్‌రెడ్డికి ఉన్న సమస్య ఏమిటి? రాష్ట్రంలో రాజీవ్‌గాంధీ విగ్రహాలు తక్కువయ్యాయా? గాంధీ విగ్రహాన్ని గాడ్సే పెడితే ఎంత దరిద్రంగా ఉంటదో తెలంగాణ తల్లి విగ్రహాన్ని రేవంత్‌రెడ్డి లాంటి తెలంగాణ ద్రోహి పెడితే అంతే దారుణంగా ఉంటుంది. పదేండ్లలో మీరెందుకు పెట్టలేదంటే.. 10 సంవత్సరాల్లో నూతన సచివాలయం కట్టలేదన్న విషయం తెలివి తక్కువ రేవంత్‌రెడ్డికి తెలియదు. సచివాలయం ప్రారంభంకాగానే తెలంగాణ తల్లి విగ్రహం పెడతామని ప్రకటించాం. స్థలాన్ని కూడా కేటాయించాం' అని వెల్లడించారు.

అహంకారంతో మాట్లాడితే అన్ని పేర్లు మార్చుతం

తాము అధికారంలో ఉన్నన్ని రోజులు రాజీవ్ ఆరోగ్యశ్రీ పేరు మార్చలేదని కేటీఆర్ గుర్తుచేశారు. అయితే, మళ్లీ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ నేతల పేర్లతో ఉన్న పథకాల పేరు మార్పును పరిశీలిస్తామని తెలిపారు. ఇదే అహంకారంతో మాట్లాడితే.. కాంగ్రెస్ నాయకుల పేర్లతో ఉన్న ప్రతి పథకం పేరును కచ్చితంగా మారుస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు ఢిల్లీకి బానిసలు అని అభివర్ణించారు. 9 నెలల్లో రేవంత్‌రెడ్డి సాధించిన గొప్ప విజయం ఢిల్లీకి 20 సార్లు పోయిరావడమేనని ఎద్దేవా చేశారు. 'కేసీఆర్ గుర్తులను తుడిపేయాలని అంటే తెలంగాణ